నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, శనివారం 10 ఫిబ్రవరి 2024 | NALGONDA



సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, సభ నల్లగొండ నియోజక వర్గ ఇన్‌చార్జి రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ నాయకులు

# కృష్ణా జలాల పరిరక్షణకు ఉద్యమించాలి

- ఈ నెల 13న కేసీఆర్ సభను విజయవంతం చేయాలి
- రైతులు గొంతెత్తకపోతే నల్లగొండ ఎడారిలా మారుతుంది
- మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ, ఫిబ్రవరి 9 : కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకున్న చీకటి ఒప్పందంలో భాగంగా కేఆర్ ఎంబీ పరిధిలోకి కృష్ణా ప్రాజెక్టులు వెళ్లాయని, కృష్ణా జలాలను పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. మన హక్కులు మనం పొందడానికి ఈ నెల 13న నల్లగొండలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. నల్లగొండలోని శుక్రవారం పట్టణ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన సభ నల్లగొండ అసెంబ్లీ ఇన్‌చార్జి రవీందర్ సింగ్‌తో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల కృష్ణా ప్రాజెక్టులు కేంద్రం పరిధిలోకి వెళ్లాయని, వాటి సాధన కోసం మరోసారి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నడుం బిగించారని తెలిపారు. ఆయనకు మద్దతుగా బహిరంగ సభకు రైతులు, ప్రజలు తరలివచ్చి గొంతెత్తాల్సిన అవసరం ఉందని చెప్పారు. వచ్చే పార్లమెంట్, మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నల్లగొండ నియోజక వర్గ పార్టీ ఇన్‌చార్జి, కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ నాడు నల్లగొండ నీళ్ల కోసం ఎన్నో కష్టాలు పడ్డదని, ఒక్క బోరు పడటానికి ఎన్నో బోర్లు వేసి రైతులు అప్పుల పాలు అయిన సంఘటనలు అందరికీ తెలుసన్నారు. అలాంటి నల్లగొండ పదేండ్లు పచ్చగా ఉంటే ఇప్పుడు సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు కేంద్రం పరిధిలోకి వెళ్లడంతో మళ్లీ నీటి కష్టాలు తప్పవని పేర్కొన్నారు. అమలు చేయలేని 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు కూడా తీర్చే పరిస్థితుల్లో లేదని తెలిపారు. సభకు ప్రతి వార్డు నుంచి రెండు వందల మంది చొప్పున నియోజక వర్గ వ్యాప్తంగా 30వేల మంది తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, మాజీ గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, నాయకులు కటికం సత్తయ్యగౌడ్, అభిమన్యు శ్రీనివాస్, మారగోని గణేశ్, పూజిత శ్రీనివాస్, బొర్ర సుధాకర్, మాలె శరణ్యారెడ్డి, సింగం లక్ష్మి, యాట జయప్రదరెడ్డి, యామ దయాకర్, నాగరత్నం రాజు, బక్క పిచ్చయ్య, సందినేని జనార్దన్ రావు పాల్గొన్నారు.

### సభా స్థలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యేలు

నల్లగొండ జిల్లా కేంద్రంలోని మర్రిగూడ బైపాస్ సమీపంలో నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను శుక్రవారం మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, జాజుల సురేందర్, చంటి క్రాంతి కిరణ్, శానంపూడి సైదిరెడ్డితోపాటు మాజీ మేయర్ రవీందర్ సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 13న సభకు మాజీ సీఎం కేసీఆర్ హాజరుకానున్నందున రైతాంగం పార్టీలకతీతంగా హాజరై మద్దతు తెలుపాలని పిలుపునిచ్చారు. వారి వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నాయకులు రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, రావుల శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజక వర్గం నుంచి వెయ్యి నుంచి రెండు వేలు, ఉమ్మడి నల్లగొండ జిల్లా నియోజక వర్గాల నుంచి పది వేలు, నల్లగొండ నియోజక వర్గం నుంచి 30వేల వరకు రైతాంగాన్ని సమీకరించే విధంగా బీఆర్ఎస్ పార్టీ చర్యలు తీసుకుంటున్నది.



నల్లగొండలో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, జాజుల సురేందర్, చంటి క్రాంతి కిరణ్, శానంపూడి సైదిరెడ్డితోపాటు మాజీ మేయర్ రవీందర్ సింగ్

# చలో నల్లగొండ సభను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు



చలో నల్లగొండ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి పటాన్‌చెరు బీఆర్ఎస్ నేత ఆదర్శ్‌రెడ్డి తదితరులు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 9 : కృష్ణా జలాలు.. కేఆర్ఎంబీపై వాస్తవాలు వివరించేందుకు, తెలంగాణ రాష్ట్ర ప్రజల హక్కుల సాధనే లక్ష్యంగా ఈ నెల 13న నల్లగొండలో మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, మిర్యాలగూడ నియోజకర్గ సమన్వయకర్త, పటాన్‌చెరు బీఆర్ఎస్ నేత ఆదర్శ్‌రెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం వేములపల్లి, మాడ్గులపల్లి, అడవిదేవులపల్లి బీఆర్ఎస్ పార్టీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అసత్య ప్రచారాలు చేస్తున్నదని, గత బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. కృష్ణా నదిపై శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలను కాంగ్రెస్ ప్రభుత్వం కేఆర్ఎంబీకి అప్పగించడంతో జిల్లా ప్రజలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. భారీ బహిరంగ సభకు నియోజకవర్గ వ్యాప్తంగా 15వేల మందికిపైగా తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం చలో నల్లగొండ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, జడ్పీటీసీ కుర్ర సేవ్యానాయక్, అడవిదేవులపల్లి ఎంపీపీ బాలాజీనాయక్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, మండల పార్టీ అధ్యక్షులు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, పాలుట్ల బాబయ్య, రైతు సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు నామిరెడ్డి యాదగిరిరెడ్డి, పెద్ది శ్రీనివాస్‌గౌడ్, ఎండీ కరీం, జెర్రిపోతుల రాములుగౌడ్, నిమ్మల నవీన్‌రెడ్డి, కట్టా మల్లేశ్‌గౌడ్, పేరాల కృపాకర్‌రావు, చిర్ర మల్లయ్యాయదవ్, మిర్యాల మధుసూదన్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.


# గురుకుల ఆద్యుడు మన పీవీ

## సర్వేల్‌లో తొలి గురుకులానికి అంకురార్పణ చేసిన నర్సింహారావు

- నల్లగొండతో విడదీయరాని అనుబంధం
- స్వాతంత్ర్య సమరయోధులు, భూదానోద్యమ నేతలు, జిల్లా కాంగ్రెస్ ముఖ్యులతో సత్సంబంధాలు
- చకిలం శ్రీనివాసరావు విగ్రహావిష్కరణకు హాజరు
- పీవీకి భారతరత్నపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు



సంస్థాన్‌నారాయణపురం మండలంలోని సర్వేల్ గురుకుల పాఠశాల



తెలుగు నేల నుంచి దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన మాజీ ప్రధాన మంత్రి, బహుభాషావేత్త పాములపర్తి వెంకటనర్సింహారావుకు ఎట్టకేలకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడంపై జిల్లాలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. పొరుగు జిల్లా వరంగల్ జిలాలో పుట్టిన పీవీ నర్సింహారావుకు నాటి నీలగిరిగా ఉన్న నేటి ఉమ్మడి నల్లగొండ జిల్లాతో విడదీయరాని అనుబంధమే ఉన్నది. పీవీ ఆలోచనతో మొగ్గ తొడిగిన గురుకుల విద్యకు నల్లగొండ జిల్లా నుంచే నాంది పలికారు. సర్వేల్ గురుకుల పాఠశాలను పీవీ స్వయంగా ప్రారంభించడం చరిత్రలో మరుపురాని ఘట్టం.

– నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ)

ఉమ్మడి నల్లగొండ జిల్లాతో రాజకీయ దురంధరుడిగా పేరొందిన మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు సామాజికంగా, రాజకీయంగా మంచి సంబంధాలు ఉన్నాయి. జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులతోపాటు భూదానోద్యమ నేతలు, జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతలతో మంచి అనుబంధమే ఉన్నది. మాజీ ఎమ్మెల్యే కాంచనపల్లి చినవెంకటరామారావు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పులిజాల రంగారావు లాంటి వారితో కుటుంబ సంబంధాలు ఉన్నాయి. ఇక జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతగా ఉన్న చకిలం శ్రీనివాసరావుతో తొలినాళ్లలో రాజకీయంగా ఏర్పడిన అనుబంధం... ఆత్మీయంగా మారి చివరి వరకు కొనసాగింది. ఈ నేపథ్యంలోనే చకిలం శ్రీనివాసరావు మృతి అనంతరం నల్లగొండలో 1998 జూలై 18వ తేదీన జరిగిన చకిలం విగ్రహావిష్కరణకు మాజీ ప్రధాని హోదాలో పీవీ నర్సింహారావు హాజరయ్యారు. పీవీ వస్తున్నాడని తెలిసి వేలాది మంది ప్రజలు ఆ సభకు తరలిరావడం అప్పట్లో విశేషంగా మారింది. అదే రోజు తన ఆత్మీయులుగా ఉన్న పులిజాల రంగారావు ఇంటికి పీవీ వెళ్లి పలుకరించి తన ఉన్నత వ్యక్తిత్వాన్ని మరోసారి చాటుకున్నారన్న చర్చ వినిపించింది. ఉప్పునూతల పురుషోత్తంరెడ్డి, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి లాంటి సీనియర్ నేతలు పీవీ నర్సింహారావుతో మంచి సంబంధాలు కలిగి ఉన్నారు.

### పీవీ చేతుల మీదుగా సర్వేల్ గురుకులం

స్వతహాగానే విద్యాధికుడు అయిన పీవీ నర్సింహారావు విద్య అందరికీ అందాలన్న ఉన్నత ఆశయంతో గురుకుల విద్యకు శ్రీకారం చుట్టారు. సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్‌లో మొట్టమొదటి గురుకులాన్నీ ముఖ్యమంత్రిగా ఉన్న పీవీ నర్సింహారావు 1971 నవంబర్‌లో తన స్వయంగా ప్రారంభించారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ గురుకుల ఎడ్యుకేషన్ సొసైటీని ఏర్పాటు చేసి అనేక గురుకులాలతో బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల ప్రతిభకు పట్టం కట్టారు. ఆ తర్వాత గురుకులాల స్ఫూర్తి దేశవ్యాప్తంగా పాకింది. పీవీ నర్సింహారావు ఆలోచన దేశానికి ఆదర్శంగా నిలిచిందనడంలో సందేహం లేదు.

### నెరవేరిన డిమాండ్..

పీవీ నర్సింహారావుకు భారతరత్న ఇచ్చి గౌరవించాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉన్నది. దీనిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు అసెంబ్లీలో తానే స్వయంగా తీర్మానం ప్రవేశపెడుతూ భారతరత్న ఇవ్వాలని కేంద్రానికి పంపించారు. ఎట్టకేలకు పీవీకి భారతరత్న ప్రకటించడంతో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పీవీకి భారతరత్నపై హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో జన్మించిన పీవీకి దక్కిన గౌరవం యావత్ తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

# పీవీకి భారత రత్నతో తెలంగాణ జాతికి గౌరవం దక్కింది

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, ఫిబ్రవరి 9 : దేశ మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారత రత్న దక్కడం చాలా సంతోషంగా ఉందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జన్మించిన పీవీ దేశ అత్యున్నత ప్రధాన మంత్రి స్థాయికి ఎదిగినందున ఆయన భారత రత్నకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. పీవీకి దక్కిన గౌరవం యావత్ తెలంగాణకే దక్కినట్లు తెలిపారు. బహుభాషా కోవిదుడుగా పేరుగాంచిన ఆయన దేశంలో ఎన్నో సంస్కరణలు అమలు చేసి గొప్ప వ్యక్తిగా నిలిచారని గుత్తా అభివర్ణించారు.

# ఎంజీయూలో జాబ్ మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాకు హాజరైన విద్యార్థులు

రామగిరి, ఫిబ్రవరి 9 : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో శుక్రవారం వర్సిటీ ప్లేస్‌మెంట్ సెల్ అధికారి వై.ప్రశాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి బీఎస్సీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, బీ ఫార్మసీ, ఎంబీఏ పూర్తి చేసిన 130 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారికి హెటిరో డ్రగ్స్, కామినేని మెడికల్ సైన్సెస్ వారు రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి 50 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్లేస్‌మెంట్ సెల్ అధికారి ప్రశాంతి మాట్లాడుతూ విద్యార్థులకు అవకాశం కల్పించిన వర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా సంస్థల హెచ్‌ఆర్‌లు, ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

- పాల్గొన్న 300 మంది క్రీడాకారులు



ఖోఖో ఆడుతున్న వరంగల్ నిజామాబాద్ జట్లు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 9 : భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 56వ సీనియర్ రాష్ట్ర స్థాయి 2023–24 ఖోఖో చాంపియన్ షిప్ పోటీలను శుక్రవారం డీఐఈఓ కె.నారాయణరెడ్డి, ఖో–ఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంగ రాఘవరెడ్డి ప్రారంభించారు. మొదటి రోజు లీగ్ మ్యాచ్‌లు నిర్వహించారు. అంతకు ముందు సాంస్కృతిక కార్యక్రమాలు, మార్చ్‌ఫాస్ట్ చేపట్టారు. ఉమ్మడి నల్లగొండ ఖో–ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు మూడు రోజుల పాటు జరుగనున్నాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాల నుంచి మహిళలు, పురుషులు 300 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నరాల నిర్మల, జిల్లా యువజన క్రీడల అధికారి ధనంజనేయులు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్‌బాబు, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఖో–ఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే ప్రజా హక్కుల రక్షణ

- ఫ్లోరైడ్‌ను తరిమికొట్టిన మహానుభావుడు కేసీఆర్
- కృష్ణా ప్రాజెక్టులపై కాంగ్రెస్ చేతగానితనాన్ని ప్రజల్లో ఎండగట్టాలి
- 13న చలో నల్లగొండ బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలి
- బీఆర్ఎస్ సన్నాహక సమావేశాల్లో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల



చండూరు : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పక్కన నాయకులు నందికంటి శ్రీధర్, పల్లె రవికుమార్

చండూరు/ మర్రిగూడ, ఫిబ్రవరి 9 : తెలంగాణ ప్రజల హక్కుల రక్షణ బీఆర్ఎస్‌తోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాను వందల ఏండ్ల నుంచి పట్టిపీడించిన ఫ్లోరైడ్ మహమ్మారిని శాశ్వతంగా తరిమికొట్టిన మహానుభావుడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అని పేర్కొన్నారు. చండూరు పట్టణం, మర్రిగూడ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభ సన్నాహక సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగిస్తే 5 జిల్లాల ప్రజలకు సాగు, తాగునీటితోపాటు కరెంటు కష్టాలు తప్పవన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం బెదిరింపులకు కేసీఆర్ తలొగ్గలేదని, కేఆర్ఎంబీకి కృష్ణా ప్రాజెక్టులను అప్పజెప్పలేదని తెలిపారు. కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు అధికారం కట్టబెడితే నమ్మించి గొంతు కోస్తున్నదని, అవగాహన రాహిత్యంతో కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింతపై సంతకాలు చేసిందని అన్నారు. నీళ్ల కోసం మళ్లీ పోరాటం చేయాల్సిన దుస్థితిని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెచ్చిందని దుయ్యబట్టారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తే మొదటగా నల్లగొండ జిల్లా ప్రజలకే ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదమున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనాన్ని ఎండగట్టి నీటి హక్కులను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నల్లగొండలో ఈ నెల 13న భారీ బహిరంగ సభకు పిలుపునిచ్చారని తెలిపారు. సభకు నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. బహిరంగ సభ ఇన్‌చార్జి నందికంటి శ్రీధర్ మాట్లాడుతూ ఈ సభ పార్టీకి సంబంధించినది కాదని, తెలంగాణ ప్రజల హక్కులను కాపాడేందుకేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌పై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ తోకల చంద్రకళ, ఎంపీపీలు మెండు మోహన్ రెడ్డి, పల్లె కల్యాణి, జడ్పీటీసీలు కర్నాటి వెంకటేశం, పాశం సురేందర్‌రెడ్డి, నాయకులు దంటు జగదీశ్, మునగాల నారాయణరావు, వెంకటేశ్వర్‌రావు, అనిల్ రావు, మధుసూదన్‌రావు, వెంకట్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.


# 23 మంది ఎస్ఐల బదిలీ

నీలగిరి, ఫిబ్రవరి 9 : నల్లగొండ, ఇతర జిల్లాల్లో పని చేస్తున్న 23 మంది ఎస్ఐలను బదిలీ చేశారు. మల్టీజోన్–2 ఐజీ ఆదేశాల మేరకు వారిని బదిలీ చేస్తూ నల్లగొండ జిల్లా ఎస్పీ చందనాదీప్తి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

| పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| ఎం.రామ్మూర్తి | నల్లగొండ ట్రాఫిక్ | కొండమల్లేపల్లి |
| సి.వీరబాబు | కొండమల్లేపల్లి | పెద్దవూర |
| బి.రాజు | నేరేడుగొమ్ము | డిండి |
| డి.సైదులు | డిండి | దేవరకొండ వన్ టౌన్ |
| సతీశ్ | దేవరకొండ వన్ టౌన్ | నేరేడుగొమ్ము |
| శేఖర్ | మహిళా పోలీస్ స్టేషన్ | మిర్యాలగూడ వన్‌టౌన్ |
| సందీప్‌రెడ్డి | సీసీఎస్ | నల్లగొండ వన్ టౌన్ |
| శ్రీకాంత్‌గౌడ్ | వీఆర్ | నార్కట్‌పల్లి |
| డి.నర్సింహులు | వీఆర్ | గుడిపల్లి |
| సతీశ్ | శాలిగౌరారం | నకిరేకల్ |
| సంతోశ్ బాబు | హాలియా | దేవరకొండ |
| డి.సతీశ్‌రెడ్డి | వీఆర్ | హాలియా (ఎస్ఐ-1) |
| ధర్మ | వీఆర్ | హాలియా (ఎస్ఐ-2) |
| పి.కృష్ణ | దేవరకొండ | నల్లగొండ మహిళా పీఎస్ |
| శ్రీను | సీసీఎస్ | కట్టంగూర్ |
| కృష్ణమూర్తి | వీఆర్ | నల్లగొండ ట్రాఫిక్ |
| నారాయణరెడ్డి | సీసీఎస్ | తిరుమలగిరి (సాగర్ ) |
| సురేశ్ | తిరుమలగిరి సాగర్ | నల్లగొండ టూ టౌన్ (ఎస్ఐ-2) |
| మహేశ్వర్ | వీఆర్ | డీఎస్‌బీ |
| రంజిత్ | గుడిపల్లి | సీసీఎస్ నల్లగొండ |
| రమేశ్‌నాయక్ | పెద్దవూర | నల్లగొండ ట్రాఫిక్ |
| రవి | వీఆర్ | కనగల్ |
| అయిలయ్య | డీసీఆర్‌బీ (సూర్యాపేట) | శాలిగౌరారం |

# బీఆర్ఎస్ హయాంలో సాగు సస్యశ్యామలం

- సాగర్ ఆయకట్టుకు సరిపడా నీళ్లు
- ప్రత్యేక ప్రణాళికతో చివరి భూములు కూడా సాగులోకి..
- పదేండ్లలో తొలిసారిగా ఎడమ కాల్వకు ఆగిన నీటి విడుదల



ఎడమ కాల్వకు నీటి విడుదల (ఫైల్)

నందికొండ, ఫిబ్రవరి 9 : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ప్రాజెక్టుల నీటిని రైతులకోసం సద్వినియోగం చేసింది. నాగార్జున సాగర్ ఆయకట్టుకు రెండు పంటలకు నీళ్లిచ్చింది. సాగునీటి ప్రాజెక్టులపై ఇతురులు పెత్తనం చేయకుండా కాపాడింది. ఇప్పుడు రాష్ట్రంలో ఆ పరిస్థితులు లేకుండా పోతున్నాయి. నాగార్జునసాగర్ డ్యామ్‌పై పెత్తనం కోసం ఏపీ ప్రభుత్వం దౌర్జన్యానికి దిగి 13వ గేట్ వరకు ఆక్రమించింది. ఇష్టానుసారంగా కృష్ణానదిలోని నీటిని కుడి కాల్వ ద్వారా విడుదల చేసుకుంటున్నారు. డ్యామ్‌పైన పరిస్థితులను చక్కదిద్దే సాకుతో కేంద్రం జోక్యం చేసుకొని సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించి నాగార్జునసాగర్ డ్యామ్‌ను కృష్ణా రివర్ బోర్డు ఆధీనంలోకి తీసుకోవడానికి ముమ్మరంగా ప్రయత్నిస్తున్నది. దీనికి తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వంత పాడుతున్నది. నాగార్జునసాగర్ డ్యామ్ కేంద్రం ఆధీనంలోకి పోతే రాబోయే రోజుల్లో రాష్ట్ర రైతుల పరిస్థితి అధ్వానంగా మారనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులు ఇబ్బంది పడకుండా ఎడమ కాల్వకు నీటిని విడుదల చేస్తూ ప్రతి ఏటా లక్షల ఎకరాలకు సాగు నీరు అందించింది. ప్రణాళికాబద్ధంగా 10 సంవత్సరాల్లో ఎడమ కాల్వకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీళ్లు ఇవ్వగా.. వరి, ఇతర ఆరుతడి పంటల సాగుతో దిగుబడి కూడా పెరిగింది. చివర ఉన్న ప్రతి మడికీ నీటిని అందించారు. ఎడమ కాల్వ, ఏఎమ్మార్, లోలెవెల్, హైలెవెల్ ప్రతి లిఫ్ట్ కింద ఉన్న పొలాలకు వెసులుబాటును బట్టి వారబందీ పద్ధతిలో నీటిని విడుదల చేశారు.

**10 ఏండ్లలో ఎడమ కాల్వ కింద పంటలకు నీటి విడుదల వివరాలు**

| సంవత్సరం | సాగర్ నీటిమట్టం (అడుగులు) | నీటి విడుదల తేదీ |
|---|---|---|
| 2014 | 515 | ఆగస్టు 6న |
| 2015 | నీటి విడుదల లేదు | తాగునీటికి మాత్రమే |
| 2016 | 514.20 | ఆగస్టు 26న |
| 2017 | 576 | అక్టోబర్ 31న |
| 2018 | 555 | ఆగస్టు 23న |
| 2019 | 556 | ఆగస్టు 11న |
| 2020 | 556 | ఆగస్టు 7న |
| 2021 | 585 | ఆగస్టు 5న |
| 2022 | 555 | జూలై 31న |

# 187మంది హోంగార్డులకు స్థాన చలనం

సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 9 : సూర్యాపేట జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న 187మంది హోంగార్డులను సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే బదిలీ చేశారు. ఎస్పీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి సీనియారిటీ ప్రకారం స్థాన చలనం కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డ్స్ పారదర్శకంగా పని చేయాలన్నారు. కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, ఏదైనా సమస్య వస్తే అధికారులకు తెలుపాలని సూచించారు. సిబ్బంది సంక్షేమం కోసం పోలీసు శాఖ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, ఆర్ఐ నారాయణ రాజు, హోంగార్డ్స్ ఇన్‌చార్జి ఆర్ఎస్ఐ అశోక్, సిబ్బంది ఉన్నారు.